క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

తుని: దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను తుని నియోజకవర్గంలో శనివారం ఘనంగా నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు శుక్రవారం తెలిపారు. తుని శ్రీరామా సెంటర్లో నిర్వహించే వేడుకలకు మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అనంతరం తొండంగి ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ జ్ఞాపకార్థం రాజా కళాశాల మైదానంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను మంత్రి రాజా ప్రారంభిస్తారన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

తుని: పట్టణంలోని పలు వార్డుల్లో మంచినీటి సరఫరాకు శనివారం ఉదయం నుంచి అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు శుక్రవారం తెలిపారు. రేఖవానిపాలెం పంప్‌హౌస్ వద్ద ఇన్‌ఫిల్ట్రైజేషన్ ప్లాంట్ మరమ్మతులు చేస్తుండడంతో 2, 3, 4, 5 వార్డుల్లో మంచినీటి ప్రెజర్ తగ్గుతుందన్నారు. సరఫరాను పునరుద్ధరించే వరకూ 1 నుంచి 10 వార్డుల ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. నీరు రాని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా అందిస్తామన్నారు.

రోగులకు రొట్టెల పంపిణీ

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు ఉచితంగా పంపిణీ చేశారు. దివంగత లంక సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు వెంకట పాపారావు వీటిని రోగులకు అందజేశారు. మూది నారాయణ స్వామి, కోరాడ కృష్ణమోహన్, చౌదరి రాంబాబు, నడిమింటి ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అవగాహన

ఏలేశ్వరం: ఓటర్ల జాబితా తయారీపై అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అవకతవకలు లేకుండా చూడాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో పర్యటించి ఓటర్ల జాబితాలను తనిఖీ చేశారు.

ఆర్బీకేలో విత్తనాలు సిద్ధం

ఏలేశ్వరం: యర్రవరం రైతు భరోసా కేంద్రంలో ఏఓ బి.జ్యోతి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో ఎంటీయూ 1064 విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పీఎం కిసాన్ పడని రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఉద్యాన శాఖ అధికారి శ్రీవల్లి మాట్లాడుతూ రైతులు వంద మంది సభ్యులతో సంఘంగా ఏర్పడితే పనిముట్లు అందజేస్తామన్నారు. సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు పాల్గొన్నారు.

దాడి చేశాడంటూ ఫిర్యాదు

రౌతులపూడి: తనపై రాఘవపట్నానికి చెందిన చెన్నాడ బీమరాజు దాడి చేశాడంటూ ఆ గ్రామ సర్పంచ్ రాయిపల్లి లోవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కోటనందూరు ఎస్సై పి.స్వామినాయుడు శుక్రవారం తెలిపారు. కొత్తూరు నుంచి పంచాయతీ కార్యదర్శితో గురువారం ద్విచక్ర వాహనంపై మాతయ్యపేట వస్తుండగా రాఘవపట్నంలో బైక్ ఆపి దాడికి దిగాడని సర్పంచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సేవలు చేరువ చేయాలి

కిర్లంపూడి: ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎస్‌ఈపీఆర్ ఎం.శ్రీనివాస్, డీఎల్‌డీఓ వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అధ్యక్షతన అధికారులు, సచివాలయ భవనాల నిర్మాణ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తులు

తుని రూరల్: తుని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఏడు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ కె.శ్రీలత శుక్రవారం తెలిపారు. 17వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. తుని మండలం జిల్లేడుపాడు (ఎస్సీ), అటికెవానిపాలెం (బీసీ–ఏ), కేఓ మల్లవరం–2 (బీసీ–డీ), చేపూరు (ఎస్సీ), కోటనందూరు మండలం బంగారయ్యపేట (ఓసీ), అల్లిపూడి–3 (ఓసీ), తొండంగి మండలం పి.అగ్రహారం–1 (బీసీ–ఈ) పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు.

మెరుగైన విద్య అందించండి

శంఖవరం: విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని సమగ్రశిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక కేజీబీవీ పాఠశాల, జెడ్పీ హైస్కూల్‌ను ఆయన పరిశీలించారు. ఎంఈఓ–2 గోవింద్, హెచ్‌ఎం పి.భాస్కరలక్ష్మి, కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలామణికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: భద్రవరం ఎంపీపీ స్కూల్‌లో నాడు–నేడు పనులను శుక్రవారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పరిశీలించారు. అనంతరం భోజనం నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ పాల్గొన్నారు.

వెదజల్లు పద్ధతి మేలు

జగ్గంపేట: ఖరీఫ్‌లో వెదజల్లు పద్ధతితో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ తెలిపారు. శుక్రవారం గుర్రంపాలెం రైతు భరోసా కేంద్రంలో అగ్రి అడ్వయిజరీ బోర్డు సమావేశం జరిగింది. బీజామృతం తయారీ విధానాన్ని వివరించారు.

పారదర్శక సేవలకు ‘జగనన్న సురక్ష’

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- అర్హులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ



రంపయర్రంపాలెంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



భద్రవరంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్

గోకవరం: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు పారదర్శక సేవలు అందుతున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. రంపయర్రంపాలెం, పెంటపల్లి గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు పథకాలకు అర్హత సాధించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రంపయర్రంపాలెం సచివాలయం–1 పరిధిలో 1,440 మందికి, సచివాలయ–2 పరిధి పెంటపల్లిలో 567 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, మండల సచివాలయాల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఉప సర్పంచ్ దాకారపు ధర్మరాజు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, తహసీల్దార్ సుగుణ పాల్గొన్నారు.

గండేపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. యల్లమిల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు తక్షణం అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. అనంతరం పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మధు, గండేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు పరిమి బాబు, గ్రామ సచివాలయ కన్వీనర్ గొల్లేపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనం : ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్రప్రసాద్

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష ద్వారా లబ్ధిదారులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. భద్రవరం గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, తహసీల్దార్ చిన్నారావు, సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నేతలు చిక్కాల లక్ష్మణరావు, సాదే లోవరాజు, అడపా పార్థసారథి, పసల నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు. ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధి 7వ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది.

కిర్లంపూడి: గోనేడలో తహసీల్దార్ కేవీవీ మాధవరావు అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సర్పంచ్ అల్లు విజయకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ అల్లు శివరామకృష్ణ, మొటిపల్లి గణేష్ పాల్గొన్నారు.

కోటనందూరు: బిళ్లనందూరులో సర్పంచ్ బొత్స మంగ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ లగుడు శ్రీను ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకులు బొత్స సత్తిబాబు, చందక రమణ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, తహసీల్దార్ ఐ.జగదీష్, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. దానవాయిపేటలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. పేదలకు అవసరమైన పలు సర్టిఫికెట్లను ఆమె అందించారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, ఎంపీడీఓ పసపులేటి సతీష్ తదితరులు ఉన్నారు.

టీడీపీ ఓటమి ఖాయం : మంత్రి దాడిశెట్టి



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: పది వేలకుపైగా ఓటర్లున్న ఎస్.అన్నవరంలో టీడీపీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శుక్రవారం ఎస్.అన్నవరం పంచాయతీ శివారు కొత్త సూరవరంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 30 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి మంత్రి దాడిశెట్టి రాజా వైఎస్సార్ సీపీ కండువాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఒక్క ఓటు కూడా పడే అవకాశం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి వైఎస్సార్ సీపీలో అంతా చేరుతున్నారని అన్నారు. అనంతరం గణపర్తి చక్రరావు, నల్లల వరహాలు, తూము బాబ్జి, వీర్నాల బాబ్జి, నరిశే సత్తిబాబు, కనిగిరి సత్తిబాబుతో సహా 30 మంది పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, జేసీఎస్ ఇన్‌చార్జి సకురు నాగేంద్రనెహ్రూ, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ హౌసింగ్ ఏఈకి అభినందన

ప్రత్తిపాడు: నవరత్నాలు– అందరికీ ఇళ్లు పథకంలో మండలాన్ని ముందు వరుసలో నిలిపిన ప్రత్తిపాడు హౌసింగ్ ఏఈ కె.సత్యనారాయణ ఉత్తమ హౌసింగ్ అధికారిగా కాకినాడలో అవార్డు అందుకున్నారు. ఆయన్ని శుక్రవారం ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, తహసీల్దార్ గోపాలకృష్ణ, అధికారులు, గృహ నిర్మాణశాఖ సిబ్బంది అభినందించారు. ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ కృషి మేరకు లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టామని సత్యనారాయణ చెప్పారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



సతీష్ (ఫైల్)

తొండంగి: ఒంటిమామిడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపారు. విశాఖ జిల్లా భీమునిపట్నం రాయపాలెం గ్రామానికి చెందిన ఎస్.రాము (32) బైకుపై గురువారం అర్ధరాత్రి ఒంటిమామిడి నుంచి కొత్తపాకల వైపు వెళ్తున్నాడు. బీచ్‌రోడ్డులో పక్కన ఆగిఉన్న లారీని అతను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదిలా ఉంటే తొండంగి శివాలయం వద్ద ప్రైవేట్ బస్సుకు పూజ చేసిన అనంతరం ప్రారంభిస్తుండగా అదుపుతప్పి బస్సు ముందుకు పోవడంతో అక్కడే ఉన్న గ్రామానికి చెందిన వీర్ల సతీష్ (35) దాని కిందపడి మృతి చెందాడు. ఈ మేరకు దర్యాప్తు చేశామని ఎస్సై వివరించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు

ప్రత్తిపాడు: ఎన్నికల విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ప్రత్తిపాడు అసెంబ్లీ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి అన్నారు. ఓటర్ల జాబితా పర్యవేక్షణలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ కుమార్‌బాబు, గృహనిర్మాణ శాఖ ఏఈ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పథకాలతో పేదల ఇంట ఆనందం



చింతలూరులో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



బూరుగుపూడిలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ధర్మవరంలో గడప గడపకూ..

ప్రత్తిపాడు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల ఇంట ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. చింతలూరు గ్రామంలో ఆయన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు బొడ్డు సతీష్, కాకి రాంబాబు, బుర్రా సత్తిబాబు, సేనాపతి రాజు, పాపారావు తదితరులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

కోటనందూరు: స్థానిక సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్ అన్నారు. జగన్నాథపురంలో సర్పంచ్ లెక్కల ఉపేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. పార్టీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, తుని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

కిర్లంపూడి: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు వైఎస్సార్ సీపీ కృషి చేస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. బూరుగుపూడిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉండి ఏదైనా కారణంతో పథకాలు అందని వారిని గుర్తించేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రజల ఆర్థికాభివృద్ధికి సహకరిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. ఎంపీపీ తోట రవి, వైస్ ఎంపీపీ పాఠంశెట్టి సత్యవతి, మండల పార్టీ అధ్యక్షుడు దోమాల గంగాధర్, సర్పంచ్ ఆసపు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు ప్రారంభం



ఇ.గోకవరంలో సుబ్బారెడ్డి ప్రాజెక్టు గేట్లు, కాలువ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: ఇ.గోకవరంలోని సుబ్బారెడ్డి ప్రాజెక్టు మరమ్మతులను శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు ప్రారంభించారు. ప్రాజెక్టు గేట్లకు సంబంధించి రబ్బర్ సీళ్లు, ఇతర మరమ్మతులు చేపట్టారు. దీనికిగాను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ రూ.3 లక్షల సొంత నిధులను సమకూర్చినట్లు ఇరిగేషన్ ఏఈఈ ఇబ్రహీం తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సాగునీరు అందించేందుకు గేట్లు, తదితర మరమ్మతులు చేపడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్, మండల కోఆప్షన్ సభ్యుడు గంటా మహాలక్ష్మీరావు, నాయకులు పిల్లా పద్మరాజు, కుమార్, ఇరిగేషన్ సిబ్బంది గొంతి దేవర ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చంటిబాబు

కిర్లంపూడి: రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. సోమవరంలో ఏలేరు ఎత్తిపోతల పథకం ద్వారా శుక్రవారం ఆయన నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు నీటి ఎద్దటి రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా సోమవరం, ఇర్రిపాక, బూరుగుపూడి, కృష్ణవరం గ్రామాల్లోని 1,200 ఎకరాల ఆయకట్టుకు ఏలేరు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేసిందన్నారు. ఎంపీపీ తోట రవి, నాయకులు తోట గాంధీ, దోమాల గంగాధర్, జనపరెడ్డి బాబు, సూది శ్రీను, తోట విష్ణు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వసతుల కల్పన

మంత్రి దాడిశెట్టి రాజా



తుని జగనన్న కాలనీ నీటి సరఫరా మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. దీనిపై శుక్రవారం ఎస్.అన్నవరం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. తుని జగనన్న కాలనీలో తాగునీటి సరఫరా నిమిత్తం రూ. 5 కోట్లు మంజూరైందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్, డీఈఈ ఎ.శివాజీ మంత్రికి తెలిపారు. అందుకు సంబంధించిన మ్యాప్‌ను చూపించారు. టెండరు ప్రక్రియ ముగిసిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పనులు శరవేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేయాలన్నారు.

వంద రోజుల ఉపాధి కల్పించాలి

ప్రత్తిపాడు: కూలీలకు వంద రోజుల ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి సూచించారు. లంపకలోవలో ఉపాధి పథకంలో జరుగుతున్న దొర చెరువు పూడికతీత పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఏపీఓ ఏవీబీ నాయుడు తదితరులున్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు గడువు పెంపు

తొండంగి: పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 12 వరకూ గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ మెహర్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు వచ్చాయన్నారు.

మసీదుల అభివృద్ధికి చర్యలు

కోటనందూరు: మండలంలో మసీదుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. శుక్రవారం స్థానిక మసీదులో ముస్లిం నేత షేక్ మీరాభాయి అధ్యక్షతన ముస్లింలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మసీదులలో అవసరాలను తెలియజేస్తే మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో ప్రాధాన్య క్రమంలో వాటిని పరిష్కరిస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా వైస్ చైర్మన్ షేక్ క్వాజా, సర్పంచ్ సుర్ల రాంబాబు, కోఆప్షన్ సభ్యుడు జిగటాల కోట సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

తొండంగి: స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు అంగుళూరి అరుణ్‌కుమార్ ఇటీవల మృతి చెందడంతో ఆ పదవిని భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఎంపీడీఓ సతీష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9న ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎంపీపీ రిజర్వేషన్ కోటా ప్రకారం ఆయా వర్గానికి చెందిన వారిని ఎంపీటీసీలు ఎన్నుకోవాల్సి ఉందన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

తొండంగి: ఒంటిమామిడిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని తుని నియోజకవర్గ కన్వీనర్ కింతాడ సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్సై రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కార్యదర్శి కండవల్లి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ నమోస్తుతే..



గోకవరం వీరభద్రునిగద్దెలో శాకంబరిగా కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక వీరభద్రునిగద్దెలో కొలువైన కనకదుర్గమ్మ వారు శుక్రవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం మహిళలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించారు.

శంఖవరం: సీతంపేటలో దుర్గామీనాక్షి అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు దేవులపల్లి సతీష్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని కూరగాయలు, పండ్లతో అలంకరించారు.

కిర్లంపూడి: జగపతినగరం అభయ దుర్గమ్మ, కిర్లంపూడి శివారు వనదుర్గమ్మ ఆలయాల వద్ద శుక్రవారం అన్న సమారాధనలు జరిగాయి.

గోకవరం: గుమ్ముళ్లదొడ్డి గ్రామ దేవత వేగుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలుత బోనాలను గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఎంపీటీసీ కోట సత్యవతి పాల్గొని మహిళలతో కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి తమ్మన్నదొర, సుంకర వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



సీతంపేటలో మీనాక్షి కనకదుర్గమ్మకు కూరగాయలు, పండ్లతో అలంకరణ